క్లుప్తంగా

సాక్షి గణపతికి విశేష పూజలు


సాక్షి గణపతి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షి గణపతికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేషపూజలు నిర్వహించారు. సాక్షి గణపతి స్వామికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోధకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేష పుష్పార్చన, నివేదన కార్యక్రమాలు చేపట్టారు. అలాగే జ్వాలా వీరభద్రస్వామివారికి అభిషేకం, విశేష పుష్పార్చన జరిపించారు.

రోగులకు బ్రెడ్డు పంపిణీ


బ్రెడ్డు పంపిణీ చేస్తున్న నాయకులు

వెలుగోడు: ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో సేవా పక్వాడ మండల కన్వీనర్ నూలు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రోగులకు, గర్భిణులకు బ్రెడ్డు ప్యాకెట్లు పంపిణీ చేశారు. ముందుగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పోతుల రాజశేఖరరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


పటేల్ సెంటర్‌లో విద్యార్థులు, అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న కమిషనర్

నందికొట్కూరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ బేబి ప్రజలకు సూచించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం మున్సిపల్ కార్యాలయం నుంచి పటేల్ సెంటర్ వరకు సచివాలయ ఉద్యోగులు, విద్యార్థులు, కార్మికులు, ఆయా గ్రామాల అధికారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటామంటూ మున్సిపల్ కమిషనర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ టీపీఓ రంగస్వామి, మేనేజర్ లత, ఏఈ దినేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను ప్రోత్సహించాలి


అవగాహన కల్పిస్తున్న ఏఎన్‌ఎం

వెలుగోడు: పిల్లలకు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను ప్రోత్సహించాలని ఏఎన్‌ఎం వెంకటేశ్వరమ్మ సూచించారు. పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రం -11లో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై ఏఎన్‌ఎం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జి. నాగలక్ష్మమ్మ, యం.పద్మావతిబాయి, కె.వి. రవణమ్మ, పి.సాలమ్మ, వి.భాగ్యలక్ష్మి, పి.మల్లేశ్వరి, సుజాత, ఏ.తులసమ్మ, శివమ్మ పాల్గొన్నారు.

- **కొత్తపల్లి:** మండలంలోని పెద్ద గుమ్మడాపురం గ్రామంలో బుధవారం ఐసీడీఎస్, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆకుకూరలు, కూరగాయల స్టాల్లను ఏర్పాటు చేశారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ రాఘవేంద్ర, సర్పంచ్ నక్క విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంధ విద్యార్థులకు చేయూత


విరాళాలు సేకరిస్తున్న దృశ్యం

వెలుగోడు: సోచ్ ఫౌండేషన్‌లోని అంధ విద్యార్థులకు స్థానిక లిటిల్ ఏంజెల్స్ పాఠశాల విద్యార్థులు బుధవారం ఆర్థిక చేయూత అందించారు. ముందుగా పాఠశాలలో అంధ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు. దీంతో లిటిల్ ఏంజెల్స్ పాఠశాల విద్యార్థులు తమ తల్లిదండ్రుల నుంచి, బంధువుల నుంచి సేకరించిన రూ.61,286లను ఫౌండేషన్ ప్రతినిధులకు కరస్పాండెంట్ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ ఎంఎఫ్ ఇమ్మానియేల్, ఏఓ ప్రశాంత, హెచ్ఎం అనిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

20న వైద్యశిబిరం

పాములపాడు: స్థానిక చౌడేశ్వరీదేవి ఆలయం వద్ద ఈనెల 20న ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఆయుర్వేద వైద్యాధికారిణి సావిత్రీ తెలిపారు. బుధవారం స్థానిక ఆయుర్వేద వైద్యశాలలో ఆమె మాట్లాడుతూ యునాని, హోమియో, ఆయుర్వేద వైద్యాధికారులు వైద్యశిబిరానికి హాజరై సేవలు అందించనున్నారన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

గ్రంథాలయ భవన నిర్మాణానికి గ్రహణం!

- ఏడాదిగా నిలిచిపోయిన పనులు
- భవన నిర్మాణానికి రూ.13.50 లక్షలు కేటాయించిన జగనన్న ప్రభుత్వం
- పిల్లర్స్ లేపి వదలేసిన కాంట్రాక్టర్.. పట్టించుకోని కూటమి ప్రభుత్వం


పునాదుల్లోనే నిలిచిపోయిన గ్రంథాలయ భవన నిర్మాణం

పగిడ్యాల: ప్రజలకు విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయ భవన నిర్మాణానికి గ్రహణం పట్టుకుంది. ఏడాది కాలంగా పనులు నిలిచిపోయి కేవలం పునాదులకే పరిమితమై వెక్కిరిస్తోంది. గత ప్రభుత్వం అభివృద్ధే లక్ష్యంగా విద్య, ఆరోగ్యం, సంక్షేమం, నవరత్నాల పథకాల అమలుకు పెద్దపీట వేసింది. అందులో భాగంగానే స్థానిక గ్రంథాలయానికి రూ.13.50 లక్షల నిధులను కేటాయించి నూతన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. టెండర్‌లలో పనులను లెస్‌కు దక్కించుకున్న కాంట్రాక్టర్ బేష్‌మెంట్, పిల్లర్స్ వరకు పనులు చేసి చేతులెత్తేశాడు.

కూటమి ప్రభుత్వం రావడంతోనే..

కాంట్రాక్టర్ దుద్యాల కనక నాగన్న బేష్‌మెంట్, పిల్లర్స్ వరకు పనులు చేసి రూ.2.40 లక్షల నిధులను డ్రా చేసుకున్నారు. అనంతరం 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఒక్క ఇటుక కూడా కాంట్రాక్టర్ పేర్చకుండా పనులు నిలిపివేశారు. ప్రస్తుతం పనులు నిలిచిపోయి ఏడాదికి పైగా కావస్తోందని లైబ్రేరియన్ మద్దమ్మ పేర్కొంటున్నారు. కొన్నేళ్లుగా స్థానిక ట్రెజరీ కార్యాలయంలోనే గ్రంథాలయాన్ని రన్ చేస్తున్నామని వెల్లడించారు. గ్రంథాలయానికి చెల్లించే సెస్‌లో నుంచి నూతన భవన నిర్మాణానికి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ పనులు పూర్తి కాకపోవడం బాధేస్తోందన్నారు. వివిధ పుస్తకాలను ఒకే చోట అందించి, వ్యక్తిగతంగా అన్ని పుస్తకాలను కొనుగోలు చేయాలని వారికి పరిష్కార మార్గాన్ని చూపిస్తాయని, అలాంటి గ్రంథాలయ భవన నిర్మాణం ఏడాది కాలంగా నిలిచిపోయినా పట్టించుకునే నాథుడు లేకపోవడం శోచనీయమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని పాఠకులు, లైబ్రేరియన్ అధికారులను కోరుతున్నారు. ఈ విషయమై కాంట్రాక్టర్‌ను వివరణ కోరగా పాములపాడు, పగిడ్యాల మండలాల్లో గ్రంథాలయ భవన నిర్మాణాలు వచ్చే నెలలో పూర్తి చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.


పాఠశాలలోకి చేరిన వర్షపు నీరు,


పక్క వీధిలోని సీసీ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

పాఠశాలలోకి వర్షపు నీరు

- ఇబ్బందుల్లో విద్యార్థులు

పాములపాడు: మండలంలోని క్రిష్ణారావుపేట గ్రామం ప్రాథమిక పాఠశాలలోకి వర్షపు నీరు చేరుతోంది. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బుధవారం కురిసిన చిన్నపాటి వర్షానికే నీరు పాఠశాల ప్రాంగణంలోకి చేరింది. పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు 50 మంది విద్యార్థులున్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. నేషనల్ హైవే 340సీ నిర్మాణంలో భాగంగా పాఠశాల ప్రహరీ వెంట డ్రైనేజీని పూడ్చడంతో వర్షపు నీరు వెళ్లే దారి లేక పాఠశాలలోకి వచ్చి చేరుతోంది. చుట్టూ కాలనీల రోడ్లు ఎత్తులో ఉండటం, పాఠశాల లోతట్టు ప్రాంతం కావడంతో చిన్నపాటి వర్షం వచ్చినా పాఠశాల చుట్టూ నీరు చేరి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంటోందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో విశ్వకర్మ భగవాన్ యజ్ఞ మహోత్సవం


యజ్ఞం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల విరాట్ విశ్వకర్మ అన్నదాన సత్రంలో బుధవారం విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని వేదపండితుల చేత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విశ్వకర్మ సుప్రభాతసేవ, గణపతిపూజ, పుణ్యాహవాచన, విశ్వకర్మ కలశపూజ, పతాకావిష్కరణ, గాయిత్రీ సమేత విశ్వకర్మ భగవానుల యజ్ఞం నిర్వహించారు. ప్రపంచశాంతి, సౌభాగ్యాల కోసం, సమస్త మానవజాతి సుఖసంతోషాలతో ఉండాలని మహాయజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో విరాట్ విశ్వకర్మ సత్రం అధ్యక్షులు ముత్తలూరి బాలయ్య ఆచారి, ప్రధాన కార్యదర్శి గొట్టిముక్కల నరసింహారావు, కోశాధికారి పాలెపు నాగభూషణాచారి, గౌరవ సలహాదారులు నూతక్కి వెంకటేశ్వరరావు ఆచారి, కార్యదర్శి లింగాల సాయిబాబు ఆచారి, మేనేజర్ సిద్దార్థ పాల్గొన్నారు.

యర్రగూడూరులో నీటి కష్టాలు

పాములపాడు: మండలంలోని యర్రగూడూరు గ్రామంలో ప్రజలకు 4 రోజులుగా నీటి కష్టాలు తప్పడం లేదు. గ్రామానికి ఎస్ఆర్ఎంసీ కాలువ నుంచి నీరు సరఫరా అయ్యేది. మోటార్ల వద్ద ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురికావడంతో నీటి సరఫరా నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి వినీలను వివరణ కోరగా ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేయిస్తున్నామని, రేపటి నుంచి నీటిని సరఫరా చేస్తామని తెలిపారు.

ఘనంగా హిందీ భాష దినోత్సవం

నందికొట్కూరు: హిందీ భాషా దినోత్సవాన్ని స్థానిక డిగ్రీ కళాశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. హిందీ భాష ప్రాధాన్యతను కర్నూలు ఉస్మానియా కళాశాల హిందీ విభాగ అధ్యక్షులు డాక్టర్ షేక్ సలీం బాషా విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రంగముని, అధ్యాపకులు పరిమళాదేవి, రవి, అన్వర్ హుసేన్, భాస్కర్ పాల్గొన్నారు.

సభ్యులకు తెలియకుండా సిబ్బందిని ఎలా నియమిస్తారు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, కమిషనర్‌ను ప్రశ్నిస్తున్న మున్సిపల్ కౌన్సిలర్లు

- కమిషనర్‌పై మండిపడిన వార్డు సభ్యులు

ఆత్మకూరు: వార్డు కౌన్సిలర్లకు తెలియకుండా మున్సిపాలిటీ పరిధిలో కాంట్రాక్ట్ ఉద్యోగాల నియామకం ఎలా చేపడతారని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, కోఆప్షన్ సభ్యులు రషీద్, వార్డు కౌన్సిలర్లు సుల్తాన్, విజయ్.. మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబును నిలదీశారు. బుధవారం జరిగిన మున్సిపల్ కౌన్సిలర్ల సర్వసభ్య సమావేశంలో రెండు తీర్మానాలు ప్రవేశపెట్టారు. మొదటి తీర్మానం అవుట్ సోర్సింగ్ కింద సిబ్బందిని తీసుకునేందుకు సభ్యులు ఆమోదం తెలిపారు. రెండో తీర్మానం గతంలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న స్వీపర్ రాము అనారోగ్యంతో విధులకు రావడం లేదని, ప్రత్యామ్నాయం ఏర్పాటు చేశారని, ఆరోగ్యం కుదుటపడిన తర్వాత విధుల్లోకి చేరతారని అంతలోనే తమకు సమాచారం ఇవ్వకుండా మరో వ్యక్తిని నియమించడాన్ని వ్యతిరేకిస్తున్నామని సభ్యులు తెలిపారు. పట్టణంలోని కుక్కల బెడదపై ప్రతి సమావేశంలో లేవనెత్తుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనరి సభ్యులు సుల్తాన్, విజయ్ కమిషనర్‌ను ప్రశ్నించారు. అంతకుముందు మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్ మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నామన్నారు. నూతన రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు.

ప్రభుత్వ మోసంపై ఉద్యమించాలి



మాట్లాడుతున్న పి.నిర్మల

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల సమయంలో.. రాష్ట్రంలో 18 ఏళ్లు నిండిన మహిళలందరికీ నెలకు రూ.1500 చొప్పున ఇస్తామని చెప్పి మోసం చేసిన కూటమి ప్రభుత్వంపై ఉద్యమించాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.నిర్మల పిలుపునిచ్చారు. బుధవారం కార్మిక, కర్షక భవన్‌లో ఐద్వా న్యూసిటీ కమిటీ మూడో మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. నేతలు కిరణ్మయి, శ్యామల అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె, జిల్లా కార్యదర్శి అలివేలుతో కలిసి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలపై జరుగుతున్న దాడులు, దోపిడీలు, హత్యలు, అత్యాచారాలను నిరోధించడంలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. చట్టాలను పకడ్బందీగా అమలు చేస్తే మహిళలపై దాడులకు అవకాశం ఉండదన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోగా కార్యదర్శిగా ఎస్.శ్యామలమ్మ, అధ్యక్షురాలిగా ఎం.కుమారి, గౌరవాధ్యక్షులుగా రత్నమ్మను ఎన్నుకున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం


ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన ఎంఈఓ సుభాన్, ఉపాధ్యాయులు

పగిడ్యాల: మండల ఉత్తమ ఉపాధ్యాయులను ఎంఈఓ సుభాన్ బుధవారం ఘనంగా సన్మానం చేశారు. స్థానిక వెలుగు కార్యాలయ సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఎంఈఓ -2 మురళీమోహన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్లాక్ బర్లీ పొగాకు సాగు నిషేధం

కొత్తపల్లి: బ్లాక్ బర్లీ పొగాకు సాగును ప్రభుత్వం నిషేధించిందని మండల వ్యవసాయాధికారి అమిరున్నీసా బేగం తెలిపారు. బుధవారం దుద్యాల, గోకవరం గ్రామాల పరిధిలో పొలాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బ్లాక్ బర్లీ పొగాకు ప్రోత్సహించరాదని రైతులకు సూచించారు. వైట్ బర్లీ పొగాకును సాగు చేసుకోవచ్చన్నారు. రైతులు కంపెనీలతో తప్పనిసరిగా ఒప్పందం చేసుకోవాలన్నారు. ఒప్పందం లేకుండా సాగు చేస్తే.. దిగుబడుల నిల్వలు, విక్రయాలకు ప్రభుత్వం బాధ్యత వహించదన్నారు.

- **బండి ఆత్మకూరు:** రైతులు వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి ఆర్ పవన్‌కుమార్ సూచించారు. కడమల కాలువ గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ మండలంలో వరి పంట పిలక దశ నుంచి ఈనె దశలో ఉన్నందున ఆకు ముడత, కాండం తొలిచే పురుగు ఆశించే ప్రమాదం ఉందన్నారు. సోలార్ దీపపు ఎర లేదా లింగాకర్షక బుట్టలను అమర్చుకోవడం ద్వారా వాటిని నివారించుకోవచ్చన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరి


దూడకు టీకా వేయిస్తున్న పశువైద్యాధికారి భాస్కర్

పాములపాడు: గాలికుంటు వ్యాధి నివారణకు పశువులకు తప్పని సరిగా టీకాలు వేయించాలని పశువైద్యాధికారి భాస్కర్ సూచించారు. బుధవారం కంబాలపల్లి గ్రామంలో పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4 నెలల వయసు దాటిన ప్రతి పశువుకు టీకా వేయించాలన్నారు.

- **బండి ఆత్మకూరు:** మండలంలోని చిన్నదేవలాపురం, ఎర్రగుంట్ల గ్రామాల్లో బుధవారం పశువులకు పశువైద్యులు అనూష, జ్యోత్స్నదేవి గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. గురువారం నారాయణాపురం, ఈర్నపాడు గ్రామాల్లో కార్యక్రమం ఉంటుందని పశువుల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

ల్యాబ్ ప్రారంభం

మహానంది: ఎం.తిమ్మాపురంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్ ల్యాబ్‌ను ప్రిన్సిపాల్ కె.లక్ష్మణరావు బుధవారం ప్రారంభించారు. ల్యాబ్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

స్వస్థ్ నారీ – స్వశక్తి పరివార్ అభియాన్ ప్రారంభం


కార్యక్రమంలో పాల్గొన్న స్టేట్ జేడీ డాక్టర్ దేవసాగర్

బండిఆత్మకూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం స్వస్థ్ నారీ – స్వశక్తి పరివార్ అభియాన్, 8వ జాతీయ పోషణ మాసోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బుధవారం ఐసీడీఎస్ సూపర్ వైజర్ టి.రమాదేవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర జేడీ డాక్టర్ దేవసాగర్, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ జగదీష్ చంద్రరెడ్డి హాజరయ్యారు. గర్భిణులకు, కిశోర బాలికలకు పోషకాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. మాతృవందన యోజన గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కాంతారావు, పీహెచ్‌సీ వైద్యులు సవిత, భావనరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి


మాట్లాడుతున్న ఎంపీడీఓ ఉమ్మర్

ఆత్మకూరు: పక్కా గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ ఉమ్మర్ సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో హౌసింగ్, ఎన్ఆర్ఈజీఎస్ అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిల్లుల కోసం ఏ ఒక్క లబ్ధిదారుడిని కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దన్నారు. ఇప్పటికే పలుచోట్ల గృహ నిర్మాణాలు నిలిచిపోయాయని, వాటిని పూర్తి చేసేందుకు లబ్ధిదారులతో మాట్లాడాలని సూచించారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద పండ్లతోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో హౌసింగ్ డీఈ నాగరాజు, ఏఈ మహేశ్వర్‌రెడ్డి, ఏపీఓలు మనోహర్, నాగార్జున పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూరు: వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని బైర్లూటీ పీహెచ్‌సీ వైద్యులు పవన్‌కుమార్, ప్రసన్నలక్ష్మి సూచించారు. మండలంలోని బైర్లూటీ చెంచుగూడెంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున తాగునీరు కలుషితమై వ్యాధుల బారిన పడే ప్రమాదముందని, ఎలాంటి అనారోగ్యానికి గురైనా వెంటనే పీహెచ్‌సీకి వచ్చి వైద్యం పొందాలని సూచించారు. రక్తహీనత బారిన పడకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బైర్లూటీ చెంచుగూడెం సర్పంచ్ గురువమ్మ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ పవన్‌కుమార్

నందికొట్కూరును కర్నూలు జిల్లాలో కలపాలి


మాట్లాడుతున్న ఆ పార్టీ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు

నందికొట్కూరు: కర్నూలు జిల్లాలో నందికొట్కూరు నియోజకవర్గాన్ని కలపాలని సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 20 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న కర్నూలు జిల్లాలో కాకుండా 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న నంద్యాల జిల్లాలో నందికొట్కూరు నియోజకవర్గం ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు గాబ్రియేల్, శేఖర్, నాగరాజు, సుధాకర్ పాల్గొన్నారు.

ప్రశాంత జీవనం సాగించాలి

మహానంది: గ్రామాల్లో ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా జీవనం సాగించాలని జిల్లా ఫ్యాక్షన్ జోన్ సీఐ ప్రభాకర్ రెడ్డి సూచించారు. సిబ్బందితో కలిసి బుధవారం రాత్రి ఆయన మండలంలోని సీతారామపురం గ్రామంలో పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడుతూ ఎలాంటి గొడవలకు, ఘర్షణలకు పాల్పడకుండా అందరూ శాంతియుతంగా జీవనం సాగించాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు.

22 నుంచి అంకాలమ్మ శరన్నవరాత్రి ఉత్సవాలు

వెలుగోడు: వేల్పనూరు గ్రామంలోని అంకాల పరమేశ్వరి అమ్మ ఆలయంలో ఈనెల 22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ స్లాలం సుధాకర్ తెలిపారు. 22న శైలపుత్రి, 23న బ్రహ్మచారిణి, 24న చంద్రఘంటాదేవి, 25న కుష్మాండ దేవి, 26న స్కంద మాత దేవి, 27న కాత్యాయని దేవి, 28న కాళరాత్రి దేవి, 29న మహాగౌరీ దేవి, 30న సిద్ధి ధాత్రి దేవి, అక్టోబరు 1న రాజరాజేశ్వరి దేవి, 2న దసరా పండుగ సందర్భంగా సాయంత్రం 4 గంటల నుంచి అమ్మవారికి తులాభారం, జమ్మి చెట్టు పూజ, అమ్మవారి గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ ఉద్యోగుల ధర్నా


విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలంప్రాజెక్ట్‌లో పనిచేస్తున్న విద్యుత్ కార్మికులు బుధవారం సున్నిపెంటలోని సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఏపీ పవర్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

ఫిజియోథెరపీతో వైకల్యం దూరం


విభిన్న ప్రతిభావంతుడికి ఫిజియోథెరపీ చేస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: ఫిజియోథెరపీతో వైకల్యం దూరమవుతుందని భవిత కేంద్రం ఫిజియోథెరపిస్టు శ్రీధర్ తెలిపారు. బుధవారం విభిన్న ప్రతిభావంతులకు ఆయన ఫిజియోథెరపీ చేశారు. ఈసందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ శారీరక, మానసిక వికలత్వంతో బాధపడుతున్న పిల్లలకు వారానికోసారి ఫిజియోథెరపీ చేయించాలని పిల్లల తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ఐఈఆర్టీలు నాగేంద్ర, ఓబన్న పాల్గొన్నారు.

కొత్తగా 15 మన గ్రోమోర్ కేంద్రాలు

శిరివెళ్ల: కొత్తగా 15 మన గ్రోమోర్ కేంద్రాలు ఏర్పాటు కానున్నట్లు మన గ్రోమోర్ జోనల్ మేనేజర్ దామోదర్ నాయుడు అన్నారు. బుధవారం స్థానిక మన గ్రోమోర్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కేంద్రంలోని ఎరువుల నిల్వలు, అమ్మకాల రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కర్నూల్ జిల్లాలో దొర్నిపాడు, గాజులపల్లె, కొనిదెల, బండిఆత్మకూరులలో కేంద్రాల ఏర్పాటు జరగనున్నాయన్నారు. కేంద్రాల ద్వారా రైతులకు ఎమ్మార్పీకే ఎరువులు, క్రిమి సంహారక మందులు లభిస్తాయన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు యూరియా, నానో యూరియా అమ్మకాలు కూడా చేపట్టామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఏరియా మేనేజర్ సుబ్బారెడ్డి, స్థానిక కేంద్ర మేనేజర్ మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి


విశ్వకర్మ చిత్ర పటానికి పూలమాలలు వేస్తున్న సభ్యులు

నందికొట్కూరు: పట్టణంలోని పగిడ్యాల రోడ్డులో వెలసిన విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వకర్మ జయంతిని బుధవారం విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ భగవానుడి చిత్ర పటానికి సంఘ సభ్యులు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు నాగభూషణం ఆచారి, శ్రీనివాస ఆచారి, జగదీశ్వర ఆచారి, ఎల్లయ్య, సత్యనారాయణ, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, కుమార్ పాల్గొన్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి


పనులను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కొత్తపల్లి: శివపురం – లింగాపురం గ్రామాల వద్ద దెబ్బతిన్న రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేయించడం కాదని పెద్దవాగుపై హై లెవల్ వంతెన నిర్మించి శాశ్వత పరిష్కారం చూపాలని సీపీఎం మండల కార్యదర్శి స్వాములు డిమాండ్ చేశారు. బుధవారం పెద్దవాగుపై జరుగుతున్న రోడ్డు తాత్కాలిక మరమ్మతులను పరిశీలించారు. మరమ్మతులు చేయించినా సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారం కాదన్నారు. హైలెవల్ వంతెనకు నిధులు మంజూరు చేయించి బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు. అలాగే ఆత్మకూరు నుంచి సంగమేశ్వరం వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు.